సాక్షి
నిజామాబాద్
గురువారం । 23 । నవంబర్ । 2023



ప్రజాసేవే ధ్యేయంగా..

ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తానని, తనను గెలిపించాలని బాన్సువాడ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పోచారం కోరారు.

- 10లో ▸



షకీల్ ప్రచారంలో ఉద్రిక్తత

ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన బోధన్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి షకీల్‌ను పలు గ్రామాల్లో అడ్డుకున్నారు.

- 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0 / 19.1

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి చల్లటిగాలులు వీస్తాయి. సాయంత్రం చలితీవ్రత పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

జిల్లాకు చేరిన వీల్‌చైర్లు



సుభాష్‌నగర్ : జిల్లాలోని పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులు, సీనియర్ సిటిజన్ ఓటర్ల కోసం వీల్ చైర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించిన నేపథ్యంలో 675 వీల్‌చైర్లు జిల్లాకు చేరాయని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జయసుధ తెలిపారు. గురువారం జిల్లాకు చేరిన వీల్‌చైర్లను త్వరలోనే పోలింగ్‌కేంద్రాలకు తరలిస్తామన్నారు. జిల్లాలోని జీపీలు, మున్సిపాలిటీల్లో 248 వీల్‌చైర్లు ఉన్నాయని, వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ నుంచి మరో 675 సరఫరా అయ్యాయన్నారు.

28న నిధి ఆప్కేనికట్

నిజామాబాద్ సిటీ : ఈనెల 28న ఉమ్మడి జిల్లాలో నిధి ఆప్కేనికట్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ కమిషనర్ గణేశ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్మూర్‌లోని వరుణ్ మోటార్స్‌లో, కామారెడ్డి జిల్లా కేంద్రం నిజాంసాగర్ రోడ్డు ఎస్పీఆర్ పాఠశాలలో కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. పీఎఫ్ చందాదారులు, యజమానులు, పెన్షనర్లు తగిన ఆధారాలతో కార్యక్రమానికి హాజరు కావొచ్చన్నారు.

23, 24 తేదీల్లో బీజేపీ అగ్రనేతల రాక



సుభాష్‌నగర్ : బీజేపీ అభ్యర్థుల తరఫున ప్రచారం నిర్వహించేందుకు జిల్లాకు అగ్రనేతలు వస్తున్నందున సభలను సక్సెస్ చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బస్వా లక్ష్మీనర్సయ్య కోరారు. బుధవారం నగరంలో పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. అర్బన్, రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి గిరిరాజ్ కళాశాల మైదానంలో బహిరంగ సభ గురువారం 11 గంటలకు ఉంటుందని, ముఖ్యఅతిథిగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వస్తున్నారన్నారు. అలాగే ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాలకు సంబంధించి ఆర్మూర్ శివారులో 24న ఉదయం బహిరంగ సభ ఉంటుందని, సభకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా హాజరుకానున్నారన్నారు. బోధన్ నియోజకవర్గ బహిరంగ సభ 24న సాయంత్రం 4 గంటలకు ఉంటుందని, ముఖ్యఅతిథిగా ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ వస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు న్యాలం రాజు, కేపీ యాదవ్, లక్ష్మీనారాయణ, వెంకటేష్, బద్దం కిషన్, కిషోర్ పాల్గొన్నారు.



ధర్పల్లి బహిరంగ సభలో పార్టీ రూరల్ అభ్యర్థి భూపతిరెడ్డికి ఓటేయాలని కోరుతున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి



ఇందూరు ఎటుంటే రాష్ట్రం అటే..

నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం

- ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్‌కు ఎక్కువ సీట్లివ్వాలి
- కవితను ఓడించడంతో జిల్లాపై కేసీఆర్ కక్ష
- దోపిడీ దొంగలను సాగనంపాలి..
- ధర్పల్లి బహిరంగ సభలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి

ధర్పల్లి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రజలు ఏవైపుంటే రాష్ట్రంలో ఆ ప్రభుత్వమే ఉంటుందన్నారు. ఈ ఉమ్మడి జిల్లా నుంచి కాంగ్రెస్‌కు అత్యధిక సీట్లు ఇవ్వాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రూరల్ నియోజకవర్గంలోని ధర్పల్లిలో ఆ పార్టీ అభ్యర్థి రేకులపల్లి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన బహిరంగసభలో రేవంత్ పాల్గొని ప్రసంగించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైతే రైతులకు ఏకకాలంలో రుణమాఫీ, పసుపు, ఎర్రజొన్నలకు గిట్టుబాటు ధర, పోడు భూములకు పట్టాలు కల్పిస్తామని పేర్కొన్నారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికొదిలేశారన్నారు.

నిజాం షుగర్స్‌ను తెరిపించలేదని, పోడు భూములకు పట్టాలివ్వలేదని, మంచిప్ప ముంపు బాధితులతో మాట్లాడలేదని, పసుపు, ఎర్రజొన్న, సోయాకు గిట్టుబాటు ధరలు కల్పించలేదన్నారు. అంకాపూర్ గురించి గతంలోనే అందరికీ తెలుసన్నారు. ఇప్పుడు మాత్రం రైతుల జీవితాలు మారలేదన్నారు. దీంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా ప్రజలు కవితను ఓడిస్తే కక్షగట్టిన కేసీఆర్ జిల్లాకే ఏమీ చేయకుండా ద్రోహం చేశారన్నారు. కాంగ్రెస్‌కు 20 సీట్లు కూడా రావని కేసీఆర్ మతితప్పి మాట్లాడుతున్నారన్నారు. కాంగ్రెస్‌కు కచ్చితంగా 80 సీట్లు వస్తాయన్నారు. పంజాబ్, హర్యానా రైతుల మాదిరిగా ఆత్మగౌరవంతో బతికే నిజామాబాద్ జిల్లా రైతులు కేసీఆర్ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్నారు. ప్రాణహిత-చేవెళ్ల డిజైన్ మేరకు మంచిప్ప జలాశయం పూర్తి చేసి సాగునీరు అందిస్తామన్నారు.

కాంగ్రెస్‌కు అధికారమిస్తే పింఛన్ రూ.4వేలు ఇస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆడబిడ్డలకు రూ.2,500 అందిస్తామన్నారు. రూ.500కే సిలెండర్, ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇళ్లకు ఉచితంగా విద్యుత్, రైతుభరోసా ద్వారా రూ.15వేలు, కౌలురైతులకు సైతం రైతుభరోసా, రైతు కూలీలకు రూ.12వేలు ఇస్తామన్నారు. విద్యార్థులకు రూ.5లక్షల బ్యాంక్ గ్యారంటీ ఇస్తామన్నారు. కేసీఆర్ మాదిరిగా డబుల్ బెడ్‌రూం అంటూ ఊహాప్రపంచం చూపకుండా ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామన్నారు. కేసీఆర్ మాత్రం 10 ఎకరాల్లో ఇల్లు కట్టుకున్నారన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థి భూపతిరెడ్డి మాట్లాడుతూ ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు రీడిజైన్ చేసి కాళేశ్వరం పేరిట ఆగం చేశారన్నారు. మంచిప్ప వద్ద ముంపు విషయమై ప్రశ్నించిన రైతులపై అక్రమంగా 307 కేసులు పెట్టారన్నారు. కాంగ్రెస్ వచ్చాక పాత డిజైన్ ప్రకారమే చేస్తామన్నారు. ఇక తెలంగాణ వర్సిటీ ఏటా రూ.100 కోట్లు ఇస్తానని చెప్పిన సీఎం రూ.10కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక టీయూను అభివృద్ధి చేస్తామని, డిచ్‌పల్లిలో 100 పడకల ఆస్పత్రికి ఏర్పాటు చేస్తామన్నారు. సారంగాపూర్ షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తామన్నారు. ధర్పల్లిలో పసుపు పరిశోధన కేంద్రాన్ని పునరుద్ధరిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, ముప్ప గంగారెడ్డి, గడ్కోల్ భాస్కర్, అరికెల నర్సారెడ్డి, ఆకుల లలిత, మునిపల్లి సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యలు గాలికి..

రూరల్ ఎమ్మెల్యేగా ఉన్న బాజిరెడ్డి ప్రజా సమస్యలను గాలికొదిలేసి తాను మాత్రం రూ. వేల కోట్ల ఆస్తులు సంపాదించుకున్నారని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. ఆర్టీసీ చైర్మన్‌గా వ్యవహరించిన బాజిరెడ్డి ఆర్టీసీ కార్మికుల పట్ల నిర్లక్ష్యం వహించారన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్టీసీ కార్మికులే కీలకమని, అలాంటి 60వేల మంది ఆర్టీసీ కార్మికుల సమస్యలను నిర్లక్ష్యం చేసి డీజిల్ అమ్మకాల్లో కమీషన్ల కోసం కక్కుర్తిపడ్డారన్నారు. ఆర్టీసీ కార్మికులు, పసుపు, సోయా రైతులు సమస్యలపై కొట్లాడితే అక్రమ కేసులు పెట్టించారన్నారు.

ఎన్నికల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హనుమంతు



వీసీలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

సుభాష్‌నగర్ : జిల్లాలో అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ హనుమంతు అన్నారు. ఎన్నికల నిర్వహణ సన్నద్ధతపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ కలిసి బుధవారం న్యూఢిల్లీ నుంచి భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) సీనియర్ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ నితేష్ వ్యాస్ వీసీ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేశామని, ఓటింగ్ వివరాలతో కూడిన స్లిప్పులను కూడా ఇప్పటికే జిల్లాలోని ఆరు నియోజకవర్గాల పరిధిలో సగటున 74 శాతం పంపిణీ పూర్తి చేశామన్నారు. కమిషనింగ్ ప్రక్రియ నిర్వహించేందుకు వీలుగా ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాలు జిల్లాకు చేరుకున్నాయన్నారు. మొత్తం 2,418 మంది ఓట్ ఫ్రమ్ హోం సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు అర్హులుగా గుర్తించామని, వారి ఇళ్ల వద్దకే వెళ్లి వారి ఓటు తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 23, 24, 25 తేదీల్లో బృందాలు ఓట్ ఫ్రమ్ హోం ప్రక్రియ చేపట్టేలా ప్రణాళిక వేశామన్నారు. జిల్లాస్థాయిలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి ఫిర్యాదులు పరిష్కరిస్తున్నామన్నారు. జిల్లాకు కేటాయించిన జనరల్ అబ్జర్వర్లు ఇప్పటికే ఈ కేంద్రాలను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, సీపీవో బాబురావు, ఎన్ఐసీ అధికారి రవికుమార్, కలెక్టరేట్ ఏవో ప్రశాంత్, సిబ్బంది పవన్, సాత్విక్, శ్రీనివాస్, రషీద్, పాపయ్య పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలను బుధవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్, అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డితో కలిసి పరిశీలించారు.

ప్రజాదరణను జీర్ణించుకోలేకే దాడులు

- కాంగ్రెస్ నిజ స్వరూపం బయటపడింది
- దాడులను ప్రోత్సహిస్తున్న రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్సీ కవిత



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్‌నాగారం : బీఆర్‌ఎస్ అభివృద్ధికి, కాంగ్రెస్ అరాచకానికి మధ్య జరుగుతున్న ఎన్నికలని, బోధన్‌లో బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి షకీల్, కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కవిత పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి రెడ్డి బెదిరింపులకు భయపడేవాళ్లెవరూ ఇక్కడ లేరన్నారు. నగరంలోని ఎమ్మెల్సీ కవిత నివాసంలో బుధవారం రాత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రౌడీయిజం, గుండాయిజాన్ని ప్రోత్సహించే వాళ్లకు పట్టం కట్టవద్దని ఆమె పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పేరును తెలంగాణ ప్రజలు రెడ్‌డైరీలో ఇప్పటికే రాసుకున్నారన్నారు. మొన్న దుబ్బాకలో, నిన్న మంథనిలో, ఈ రోజు బోధన్‌లో జరిగిందన్నారు. రేవంత్‌రెడ్డి దాడులను ప్రోత్సహిస్తూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. ఎస్సారెస్పీని కేసీఆర్ పూర్తిచేయించారన్నారు. బోధన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్ రెడ్డికి చిత్తశుద్ధి ప్రజలకు ఏం చేస్తారో చెప్పాలని ఇలా గుండాయిజం చేయడం ఎందుకన్నారు. సీఎం కేసీఆర్ మాత్రం మన బిడ్డలు డాక్టర్లు, ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు కావాలని ఆంకాంక్షిస్తున్నారన్నారు. బాజిరెడ్డి ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్నప్పుడే ఆ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేశామన్నారు. ఉల్టా ఆర్టీసీ ఉద్యోగులకు అన్యాయం చేసినట్లు రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదన్నారు. జిల్లాకు పూర్తిగా రేవంత్ రెడ్డి చూడాలని, గతంలో కంటే మూడు రెట్ల ఆయకట్టు పెరిగిందన్నారు. ఎస్సారెస్పీ గురించి మాట్లాడే అధికారం, హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో ఓటడిగే హక్కు లేదన్నారు. మాజీ ఎంపీ సీతారాం నాయక్, మేయర్ దండు నీతు కిరణ్ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటే..

- వాళ్లు మాకు పోటీ కాదు • నాలుగు దశాబ్దాల నా రాజకీయ జీవితంలో ఎలాంటి ఆరోపణలు లేవు
- 'అర్బన్' ప్రజలు మార్పు కోరుకుంటున్నారు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీ



ఖలీల్‌వాడి: బీఆర్‌ఎస్, బీజేపీ ఒక్కటేనని ప్రజలు బలంగా నమ్ముతున్నారు. ఆ రెండు పార్టీలు కాంగ్రెస్‌కు పోటీకావు. ఒకరు అవినీతికి పాల్పడుతూ, కమీషన్లు దండుకుంటూ తొమ్మిదేళ్లలో నగరాభివృద్ధిని గాలికొదిలేశారు. మరొకరు వ్యాపారాలకు పరిమితం. కేంద్రం నుంచి నిధులు తెచ్చి అభివృద్ధి చేసింది లేదు. నగర ప్రజలు మార్పు కోరుకుంటున్నారు. ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా, మంత్రిగా పనిచేశా. ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టా. నా 40 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. మైనార్టీల కంటే ఎక్కువగా మెజార్టీ ప్రజలతోనే మమేకమయ్యానంటున్న నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ అభ్యర్థి షబ్బీర్ అలీతో 'సాక్షి' ఇంటర్వ్యూ..

అర్బన్‌లో త్రిముఖపోటీ ఉందా?

అర్బన్‌లో త్రిముఖ పోటీ లేదు. నా అభ్యర్థిత్వాన్ని ప్రకటించడం ఆలస్యమేమీ కాలేదు. మా పార్టీ కార్యకర్త నుంచి రాష్ట్రస్థాయి నాయకుడి వరకు గెలుపు కోసం పనిచేస్తున్నారు. ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షుడిగా, మంత్రిగా పనిచేసినప్పటి నుంచి నగర ప్రజలతో సత్సంబంధాలున్నాయి.

అర్బన్ అభివృద్ధికి ఏం చేస్తారు?

జిల్లా కేంద్రంలో వర్షం కురిస్తే రోడ్లపైకి మురికినీరు వస్తోంది. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీని తొమ్మిదేళ్లలో ఎందుకు ప్రారంభించలేదు? బాబాన్‌సాహెబ్‌పహాడ్‌లో వంతెన నిర్మాణం ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. మేం అధికారంలోకి రాగానే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీని పూర్తి చేస్తాం. సుందరనగరంగా తీర్చిదిద్దుతా.

క్రీడారంగం కోసం ఏం చేస్తారు?

తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం క్రీడారంగాన్ని పట్టించుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణలోనే అతిపెద్ద రెండవ స్టేడియంను నిర్మిస్తా. స్పోర్ట్స్‌కాంప్లెక్స్‌ల నిర్మాణాలు చేపడుతా. కామారెడ్డిలో ఇందిరాగాంధీ స్టేడియం నిర్మించా. అక్కడ హెచ్‌సీఏ ద్వారా అండర్-19 క్రికెట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు ప్రయత్నించినప్పటికీ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమితో ఆ ప్రక్రియ అక్కడే ఆగిపోయింది.

కాంగ్రెస్‌కు ఏ పార్టీతో పోటీ?

అర్బన్‌లో కాంగ్రెస్‌కు ఏ పార్టీ పోటీలో లేదు. బీఆర్‌ఎస్ అభ్యర్థిపై కమీషన్లు, అవినీతి ఆరోపణలు ఉండగా, బీజేపీ అభ్యర్థికి బిజినెస్‌లు మాత్రమే తెలుసు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీములను ప్రజల్లోకి తీసుకువెళ్లాం. ప్రజలకు కాంగ్రెస్‌పై నమ్మకం ఏర్పడింది.

మంత్రిగా, డీసీసీ అధ్యక్షుడిగా చేసిన పనులు..?

మంత్రిగా ఉన్న సమయంలో 400 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను డిచ్‌పల్లిలో ఏర్పాటు చేశాను. తెలంగాణ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు ఇది ఉపయోగపడుతున్నది. ఉమ్మడి జిల్లాలో 125 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉండగా మరో 125 విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేశాను. డీసీసీ అధ్యక్షుడిగా పని చేసిన సమయంలో ఉమ్మడి జిల్లాలోని ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులతో సంబంధాలు ఉన్నాయి. కాంగ్రెస్‌ను బలోపేతం చేశాను.

ఎమ్మెల్యేగా గెలిస్తే ఏం చేస్తారు?

నిరుద్యోగుల కోసం స్కిల్ సెంటర్ ఏర్పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తా. పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతోపాటు ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు చెల్లిస్తాం. నగరంలో స్పోర్ట్స్ క్లబ్‌లు, తెలంగాణలోనే రెండో అతిపెద్ద స్టేడియం నిర్మిస్తాం. ఇంటింటికీ తాగునీరు, పార్కులు, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం, అర్హులకు రేషన్‌కార్డులు, పింఛన్లు అందిస్తాం.

కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రజలకు మీరు చెప్పేదేమిటి?

ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ నగరాన్ని అభివృద్ధి చేసి చూపుతా. నీతి, నిజాయితీతో నిస్వార్థంగా సేవ చేసి నేనేమిటో నిరూపిస్తా. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి రూపాయి, పథకాన్ని లబ్ధిదారుడికి చేరవేస్తా. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా కాంగ్రెస్‌కు ఓటువేసి గెలిపించాలని నగరవాసులను కోరుతున్నా.

ఓ వర్గానికే షబ్బీర్ ప్రాధాన్యత ఇస్తున్నారనే ప్రచారం ఉంది?

కొంత మంది కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు 100 దేవాలయాలు నిర్మించాను. మద్దికుంటలోని రామలింగేశ్వర స్వామి జాతర సందర్భంగా కళ్యాణం కోసం పట్టువస్త్రాలు, తలంబ్రాలు తీసుకువెళ్లా. మైనార్టీల్లో 10 శాతం మంది ఉంటే నాకు మెజార్టీలో 90 శాతం ప్రజలు అండగా ఉన్నారు.

క్లుప్తంగా

రక్తదానంతో ఇతరులకు ప్రాణదానం

తెయూ(డిచ్‌పల్లి): రక్తదానంతో ఇతరుల ప్రాణాలను కాపాడవచ్చని తెయూ రిజిస్ట్రార్ యాదగిరి అన్నారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2, 3, 4 వలంటీర్లు రక్తదాన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్తులకు సాయంగా వలంటీర్లు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆరతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రవీందర్‌రెడ్డి, చీఫ్ వార్డెన్ మహేందర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ స్రవంతి, స్వప్న, సిబ్బందిపాల్గొన్నారు.

రూరల్ డెవలప్‌మెంట్ సిద్ధాంత గ్రంథం ఆవిష్కరణ



తెయూ(డిచ్‌పల్లి): నగరంలోని ఆలిండియా రేడియో స్టేషన్‌లో క్యాజువల్ అనౌన్సర్‌గా పని చేస్తున్న సింగారం శ్రీనివాస్ రచించిన 'రేడియో-రూరల్ డెవలప్‌మెంట్' సిద్ధాంత గ్రంథాన్ని తెయూ సోషల్ సైన్స్ డీన్, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ బుధవారం ఆవిష్కరించారు. గ్రంథాన్ని రచించిన శ్రీనివాస్‌ను చంద్రశేఖర్ అభినందించారు. ఇప్పటికీ రూరల్ డెవలప్‌మెంట్ అంశంలో రేడియో ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ రేడియో స్టేషన్ ప్రోగ్రామ్స్ ఎగ్జిక్యూటివ్ సుర్యప్రకాశ్, డ్యూటీ ఆఫీసర్ మోహన్‌దాస్, ఇంజినీరింగ్ సిబ్బంది, వాఖ్యాతలు పాల్గొన్నారు.

ఐక్యూఏసీ డైరెక్టర్‌గా అడికె నాగరాజు



తెయూ(డిచ్‌పల్లి): తెయూ ఐక్యూఏసీ డైరెక్టర్‌గా కెమిస్ట్రీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ అడికె నాగరాజు నియామకమయ్యారు. తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ యాదగిరి నాగరాజుకు నియామక ఉత్తర్వులను బుధవారం అందజేశారు. అనంతరం నాగరాజును అధ్యాపకులు బాలకిషన్, సాయిలు అభినందించారు.

ఓటు వేయండి.. రాయితీ పొందండి



ఆర్మూర్‌టౌన్: ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రభుత్వంతో పాటు ప్రైవేటు సంస్థలు బాధ్యాతయుతంగా వ్యవహరిస్తున్నాయి. ఆర్మూర్ పట్టణంలోని దేవీ ఫ్యామిలీ రెస్టారెంట్ వారు ఓటు హక్కు వినియోగించుకున్నవారికి ప్రత్యేక రాయితీ సౌకర్యం కల్పిస్తున్నారు. ఓటు హక్కు వినియోగించుకున్నవారికి తమ రెస్టారెంట్‌లో అన్ని రకాల పసందైన వంటకాలపై 10 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు యజమానులు చుక్కల నరేశ్, చుక్కల సురేశ్ తెలిపారు.

ఎడపల్లి ఘటనలో మూడు పార్టీలపై కేసులు..?

ఎడపల్లి (బోధన్) : ఎడపల్లి మండలం సాటాపూర్ గేట్ వద్ద జరిగిన ఘటనపై బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీలపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లు తెలిసింది. ఎడపల్లి పోలీస్ స్టేషన్‌లో ఇరు వర్గాల చెందిన ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసు నమోదుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. దీంతో బోధన్ నియోజకవర్గంలో సాటాపూర్ వద్ద జరిగిన చర్చనీయాంశంగా మారింది. బీఆర్‌ఎస్ శ్రేణులు పోలీసులు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల తీరుపై రేవంత్ రెడ్డి సీరియస్ అయిన విషయం తెలిసిందే. ఈ కేసు విషయమై ఏసీపీ కిరణ్‌కుమార్ ఎస్సైలను ఫోన్‌లో వివరణ కోరేందుకు ప్రయత్నించగా వారు స్పందించలేదు.

తెలంగాణ ఇచ్చింది సమస్యలు తీర్చేది కాంగ్రెస్సే..

- అవినీతికి మారుపేరు బీఆర్‌ఎస్
- మార్పు కోరుకుంటున్న ప్రజలు
- అధికారంలోకి వస్తే పాత డిజైన్ ప్రకారమే మంచిప్ప ప్రాజెక్టు
- వ్యవసాయం, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యత
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ రూరల్ అభ్యర్థి భూపతిరెడ్డి



తెలంగాణ ఇచ్చింది, ప్రజల సమస్యలు తీర్చేది కాంగ్రెస్సే అని కాంగ్రెస్ రూరల్ అభ్యర్థి డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ మాయమాటలు నమ్మి రెండు సార్లు బీఆర్‌ఎస్‌ను గెలిపించిన ప్రజలు మోసపోయామని గుర్తించి మార్పు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రమంతటా సునామీలా కాంగ్రెస్ హవా నడుస్తోందన్నారు. మంగళవారం 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలపై మాట్లాడారు. –డిచ్‌పల్లి

సాక్షి ఇంటర్వ్యూ

➡ ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

☛ తెలంగాణ ఉద్యమకారుడిగా, విద్యావంతుడిగా, వైద్యుడిగా తనను ప్రజలు కోరుకుంటున్నారు. ప్రచారానికి నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. తెలంగాణ ఉద్యమకారుడిగా ప్రజల్లో గుర్తింపు ఉంది. ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించి సీఎం కేసీఆర్‌తో విభేదించి మూడేళ్ల ఎమ్మెల్సీ పదవిని వదులుకున్నాను. 2018లో కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాను. అయినా ఐదేళ్లు ప్రజల మధ్యే ఉన్నాను. మంచిప్ప ప్రాజెక్టు, ఇతర సమస్యలు, ఎమ్మెల్యే అవినీతిపై పోరాటం చేశాను. నాపై ఎలాంటి ఆరోపణలు లేవు. నా జీవితం తెల్లకాగితం లాంటిది.

➡ ప్రజలకు మీరిచ్చే హామీలు ఏమిటి?

☛ ప్రాణహిత చేవేళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ 21 పనులు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పూర్తయ్యాయి. అప్పటికే రూ.800 కోట్లు ఖర్చు చేశారు. మరో రూ.300 కోట్లు ఖర్చు చేస్తే ప్రాజెక్టు పూర్తయ్యేది. ఈ ప్రాజెక్టు పూర్తయితే రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. అయితే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రీడిజైన్ పేరిట రూ.3వేల కోట్లకు ప్రతిపాదనలు పెంచారు. దీంతో పలు గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్టును పూర్తి చేసి గ్రావిటీ ద్వారా ఏడు మండలాలకు సాగునీరందిస్తాం. వ్యవసాయంతో పాటు విద్య, వైద్యరంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. మండలానికి జూనియర్ కళాశాల, 50 పడకల ఆస్పత్రి, నియోజకవర్గం కేంద్రంలో 500 పడకల ఆస్పత్రి, ఇళ్లు లేని వారికి ఇందిరా ఆవాస్ యోజన ద్వారా ఇండ్లు ఇస్తాం. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రకారం గల్ఫ్ బోర్డును ఏర్పాటు చేస్తాం. గల్ఫ్ వలస కార్మికులకు వారు ఎంచుకున్న రంగంలో ప్రత్యేక శిక్షణ ఇప్పించి మెరుగైన ఉపాధి కోసం కృషి చేస్తాం.

➡ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై ప్రజల స్పందన..?

☛ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో, 2018లో బీఆర్‌ఎస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఏవీ నెరవేర్చలేదు. డబుల్ బెడ్‌రూం ఇండ్లు, నిరుద్యోగ భృతి, దళితులకు 3ఎకరాల భూమి, 57 ఏళ్లలకే పింఛన్, ఉద్యోగాల కల్పన, దళితబంధు, బీసీ బంధు అమలులో పూర్తిగా విఫలమయ్యారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు మోసపోయామని గుర్తించారు. ఈ ఎన్నికల్లో మార్పు కోరుకుంటున్న ప్రజలు ఈ సారి కాంగ్రెస్‌ను గెలిపించాలని ప్రజలు భావిస్తున్నారు. తమ పార్టీ ఆరు గ్యారెంటీలకు ప్రజల నుంచి అపూర్వ స్పందన వస్తోంది. మహాలక్ష్మీ పథకం ద్వారా మహిళలకు ప్రతి నెలా రూ.2,500, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, రైతుభరోసా పేరిట రైతులు, కౌలురైతులకు ప్రతి ఏడాది రూ.15వేలు, రూ.2లక్షల వరకు రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్ అందిస్తాం. కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ పథకంలో ఆడపిల్ల పెళ్లికి రూ.లక్షతో పాటు 10గ్రాముల బంగారం అందజేస్తాం. మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తాం.

ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తా..



వర్నిలో మాట్లాడుతున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి



రుద్రూర్‌లో మాట్లాడుతున్న పోచారం

- అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి
- బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తానని, నియోజకవర్గ ప్రజలు తనను ఎన్నికల్లో గెలిపించాలని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మండలంలోని బొప్పాపూర్, రుద్రూర్ మండల కేంద్రంలో బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పోచారం మాట్లాడుతూ... గ్రామాల్లో ప్రజలు అడిగిన ప్రతి పని చేశానని, రుద్రూర్‌లో రూ.37 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రజలకు బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించారు. అనంతరం వివిధ కుల సంఘాల సభ్యులు ఏకగ్రీవ తీర్మానప్రతులు స్పీకర్‌కు అందజేశారు. కార్యక్రమాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం సురేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ నరోజీ గంగారాం, ఎంపీపీ సుజాతానాగేందర్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పత్తి లక్ష్మణ్, బాల్‌రాజ్, బోధన్ ఏఎంసీ చైర్మన్ వి. వెంకటేశ్వరరావ్ దేశాయ్, విండో చైర్మన్ సంజీవరెడ్డి, మాజీ చైర్మన్ పత్తి రాము తదితరులు పాల్గొన్నారు.

కడుపులో పెట్టి చూసుకున్నా..

వర్ని: మండల ప్రజలను తన కడుపులో పెట్టి చూసుకున్నానని బీఆర్‌ఎస్ బాన్సువాడ అభ్యర్థి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలో ప్రధానంగా వ్యవసాయానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించి సిద్ధాపూర్ రిజర్వాయర్ జాకోరా లిఫ్ట్ ఇరిగేషన్ చెరువుల మరమ్మతులకు రూ. కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ప్రచారంలో జెడ్పీటీసీ హరిదా సు, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు గోపాల్, సర్పంచుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాని బాబు, పార్టీ మండల అధ్యక్షుడు గిరి, మేక వీర్రాజు, కరీం, సర్పంచులు శ్రీనగర్ రాజు, కన్నీరాం పాల్గొన్నారు.




ధర్పల్లిలో రేవంత్ రెడ్డి సభలో పాల్గొన్న ప్రజలు

కల్యాణం.. కమనీయం

- వైభవంగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం



తాలి బొట్టును చూపుతున్న అర్చకులు



స్వామి వారి కల్యాణం

భీమ్‌గల్: మండలంలోని నింబాచల క్షేత్రంపై బుధవారం లక్ష్మీ నృసింహస్వామి కల్యాణోత్సవం వైభవంగా కొనసాగింది. నింబాచల క్షేత్రంలో ఈ నెల 18 నుంచి ప్రారంభమైన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ వేడుక నిర్వహించారు. అంతకుముందు ఆలయంలోని మూల విరాట్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పల్లకీసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, నంబి లింబాద్రి కుటుంబీకులు స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.



పట్టువస్త్రాలు అందజేస్తున్న అర్చకులు

క్రైం కార్నర్

గజ్జలమ్మ జాతరలో అపశ్రుతి

- విద్యుదాఘాతంతో ఒకరి మృతి
- ముగ్గురికి గాయాలు



మాధవరావు(ఫైల్)

రుద్రూర్: మండలంలోని అంబం(ఆర్) గ్రామంలో కొనసాగుతున్న గజ్జలమ్మ ఉత్సవాల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. బుధవారం ఆలయం నుంచి రథం తీసుకెళుతున్న సమయంలో విద్యుదాఘాతంతో ఒకరి మృతి చెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రతి ఏడాది వానకాలం పంటలు చేతికొచ్చిన తరువాత గజ్జలమ్మ ఉత్సవాలను రెండు రోజుల పాటు నిర్వహిస్తామని తెలిపారు. రెండోరోజైన బుధవారం ఆలయం చుట్టూ రథాన్ని ప్రదక్షిణ చేపట్టి గ్రామంలోకి తీసుకొస్తున్న సమయంలో రోడ్డుపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు రథంపై పడింది. ఈ ఘటనలో నలుగురు విద్యుదాఘాతానికి గురికాగా వీరిని అంబులెన్స్‌లో బోధన్ ఆసుపత్రికి తరలించారు. కోటగిరి మండలం సుంకిని గ్రామానికి చెందిన మాధవరావు (20) మేనమామ నివాసమైన అంబం గ్రామానికి ఉత్సవాలకు హాజరు కాగా విద్యుదాఘాతంతో మృతి చెందాడు. అంబం గ్రామానికి చెందిన కుర్లెపు గంగాధర్, కుర్మ పోశెట్టి, శివకుమార్‌కు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

బోధన్‌రూరల్: ట్రాక్టర్ బోల్తాపడిన ఘటనలో ఒకరు మృతి చెందినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. మండలంలోని పెంటకుర్దు గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి వేరొకరి ట్రాక్టర్‌ను రిపేర్ కోసం బోధన్‌కు తీసుకెళ్తుండగా ప్రమాదవశాత్తు పెంటకుర్దులో బోల్తాపడింది. ఈ ఘటనలో భాస్కర్‌రెడ్డిపై ట్రాక్టర్ వెనుకభాగం పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

ఎమ్మెల్యే షకీల్ ప్రచారంలో ఉద్రిక్తత



కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి సీను తదితరులపై లాఠీ ఝుళిపిస్తున్న సీఐ శ్రీనివాసరాజు



ఇరువర్గాల కార్యకర్తలను చెదరగొడుతున్న పోలీసులు

- పలు గ్రామాల్లో ప్రచారాన్ని అడ్డుకున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు
- ప్రతిఘటించిన బీఆర్‌ఎస్ శ్రేణులు

ఎడపల్లి: మండలంలో బోధన్ బీఆర్‌ఎస్ అభ్యర్థి మహ్మద్ షకీల్ ఆమేర్ ప్రచారంలో ఉద్రిక్తత నెలకొంది. బుధవారం షకీల్ అంబం(వై), ఏఆర్‌పీ క్యాంప్ గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతుండగా కొందరు మహిళలు, గ్రామ ప్రజలు తమ సమస్యలపై ప్రశ్నించారు. ఈ క్రమంలో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుంది. అనంతరం మండలంలోని బ్రాహ్మణపల్లిలో ఎమ్మెల్యే ప్రసంగిస్తుండగా గ్రామానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు సమస్యలపై నిలదీసే ప్రయత్నం చేయగా బీఆర్‌ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో వారు షకీల్ వాహనాలు ముందుకు వెళ్లకుండా అడ్డు తగిలారు. ప్రచార వాహనాలకు అడ్డంగా పడుకొనే యత్నం చేయగా బీఆర్‌ఎస్ నాయకులు వారిని లాగేసి వాహనాలను కదిలించారు. అనంతరం జైతాపూర్‌లో కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకొనే యత్నం చేయగా బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలకు తోపులాట జరిగి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు శ్రీరామ్ ఒకరిపై ఒకరు చేయి చేసుకున్నారు. సింగిల్ విండో చైర్మన్ అనుచరులు బీఆర్‌ఎస్ నాయకులు నాగేందర్ రెడ్డి, రామకృష్ణరెడ్డిపై చేయి చేసుకున్నారు. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడం వారు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం ఎమ్మెల్యే షకీల్ జంలం గ్రామంలో ప్రచారం ముగించుకొని బోధన్ వెళ్లే క్రమంలో శాటాపూర్ గేట్ వద్ద ఎమ్మెల్యే వాహనాన్ని అడ్డుకోవడానికి కాంగ్రెస్ నాయకులు గుమిగూడారు. విషయం తెలిసిన బీఆర్‌ఎస్ నాయకులు అక్కడికి వెళ్లగా ఘర్షణ చోటు చేసుకుంది. ఎడపల్లి ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌పై కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్‌పై దాడి చేశారు. ఈ క్రమంలో ఇరువురికి స్వల్ప గాయాలయ్యాయి. సాటాపూర్ గేట్ వద్ద షకీల్ తన వాహనం దిగి వచ్చి మాట్లాడారు. పోలీసులు ఆయనను సముదాయించారు. బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ఇరువర్గాలను చెదరగొట్టారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి షకీల్ ప్రచారాన్ని అడ్డుకున్న వారిపై కేసులు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు.

పరామర్శించిన మాజీ మంత్రి

ఎడపల్లి: మండలంలోని శాటాపూర్ గేటు వద్ద బుధవారం పోలీసులు జరిపిన లాఠీచార్జిలో గాయపడ్డ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పులి శ్రీనివాస్, జైతాపూర్ సింగిల్ విండో చైర్మన్ నారాయణ, నాయకులు కృష్ణారావును మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. బిల్ల రామ్మోహన్, సర్పంచులు శ్రీలక్ష్మి రాంగోపాల్, అమానుల్లా, విజయకుమార్, మోబిన్ ఖాన్, నాగభూషణం ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకులపై దాడి సరికాదు

బోధన్‌టౌన్: ఎడపల్లి మండలంలో ప్రచారం చేస్తుండగా బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు దాడి చేయడం పద్ధతి కాదని ఎమ్మెల్యే షకీల్ అన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన మాట్లాడారు. అమ్దాపూర్, ఏఆర్పీ క్యాంప్, బ్రాహ్మణపల్లి, జైతాపూర్ గ్రామాల్లో ప్రచారం చేస్తుండగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు కొందరు పనిగట్టుకొని మారాణాయుధాలతో పాటు మద్యం సీసాలతో దాడులు చేసేందుకు యత్నించారన్నారు. సాటాపూర్ గేట్ బీఆర్‌ఎస్ కార్యకర్తలను ఒక గదిలో బంధించి కాంగ్రెస్‌కు చెందిన పులి శ్రీనివాస్, కౌన్సిలర్ శరత్‌రెడ్డి, జైతాపూర్ సొసైటీ చైర్మెన్ నారాయణ, రాంగోపాల్‌రెడ్డి, భార్గవ్ అనే వ్యక్తులు దాడులు చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఓడిపోతామనే విషయాన్ని జీర్ణించుకోలేక దాడులకు పాల్పడుతున్నారన్నారు. తనపై హత్యాయత్నం, దాడి చేసిన కాంగ్రెస్‌కు నాయకులు పులి శ్రీనివాస్, శరత్‌రెడ్డి, నారాయణ, రాంగోపాల్ రెడ్డితో పాటు బీజేపీ నాయకులపై కేసులు నమోదు చేయాలన్నారు.

పోలీసులు పట్టించుకోలేదు..

బీఆర్‌ఎస్ నాయకులపై దాడులు జరుగుతున్నా సీపీ పట్టించుకోవడం లేదని ఎమ్మెల్యే షకీల్ ఆరోపించారు. మొన్న పెంటాఖుర్దులో, నేడు ఎడపల్లి మండలంలో కాంగ్రెస్‌కు చెందిన దుండగులు దాడులు చేస్తుంటే పోలీసులు చూస్తూ ఉన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీపీతో పాటు ఏసీపీతో ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడారు. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



బోధన్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముస్తాక్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే షకీల్

పరామర్శించిన ఎమ్మెల్యే

దాడిలో గాయాలపాలై చికిత్స పొందుతున్న ముస్తాక్‌ను ఎమ్మెల్యే పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. దాడిలో గాయపడ్డ ఎడపల్లి వైస్ ఎంపీపీ ఇమ్రాన్‌ఖాన్, ఉప సర్పంచ్ ఆకుల శ్రీనివాస్‌ను నిజామాబాద్‌కు తరలించారు.

పేదరికమే ప్రాణం బలిగొంది

- జ్వరంతో బాలుడి మృతి



నరేశ్ ఒడిలో కొడుకు చందు మృతదేహం

బాల్కొండ: పేదరికం కన్న కొడుకు ప్రాణాన్ని బలితీసుకుంది. కొడుకు జ్వరంతో అవస్థ పడుతుంటే మంచి ఆస్పత్రిలో చూపించలేని పరిస్థితి. స్థానిక ఆర్‌ఎంపీ వద్దే వైద్యం చేయించడంతో చివరికి కొడుకు తనువు చాలించాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా చెన్నైపాలెం కు చెందిన నరేశ్ 20 రోజుల క్రితం కుటుంబంతో సహా నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం ఇత్వార్‌పేట్‌కు వచ్చి శివారులో గల ఇటుక బట్టీల్లో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన కుమారుడు చందు(5) వారం రోజుల నుంచి ట్రాన్సిల్స్‌తో (గదవ బిల్లలు) జ్వరం రాగా బాధపడుతున్నాడు. చందును స్థానిక ఆర్‌ఎంపీ వద్ద వైద్యం చేయించారు. ఎంతకీ జ్వరం తగ్గక పోవడంతో నరేశ్ కుమారుడిని బుధవారం బాల్కొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే చందు అప్పటికికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. చేతిలో డబ్బు లేకపోవడంతో కుమారుడి శవంతో నరేశ్ ఆస్పత్రిలో బాధపడుతుండగా గమనించిన స్థానికులు తోచిన ఆర్థిక సహాయం చేశారు. నరేశ్ కుమారుడి శవాన్ని స్వగ్రామానికి తీసుకెళ్లాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మెడికల్ కళాశాలకు పార్థివదేహం అప్పగింత

ఖలీల్‌వాడి: రూరల్ మండలంలోని మాధవనగర్‌కు చెందిన కొంగర రోహిత్ (33) మంగళవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మెడికల్ కళాశాల విద్యార్థుల ప్రయోగశాలకు పార్థివదేహాన్ని బుధవారం అప్పగించారు. మాధవనగర్ నుంచి ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకు మృతదేహంతో ర్యాలీ నిర్వహించారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు నివాళులర్పించి, వారి కుటుంబానికి సానుభూతి తెలిపారు. సీపీఐఎంఎల్ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య, ప్రభాకర్, నారాయణ రావు, నర్రా రామారావు, ప్రతాప్, పరుచూరి శ్రీధర్, దాసు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

మోపాల్: మండలంలోని కంజర్ వాగులో అదే గ్రామానికిచెందిన బైండ్ల రాజు (43) మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ బుధవారం తెలిపారు. రాజుకు కొన్నేళ్లుగా మానసికస్థితి సరిగా లేదు. ఈనెల 20న రాత్రి బహిర్భూమికి అని ఇంటి నుంచి వెళ్లిన రాజు తిరిగి రాలేదు. వాగులో మృతదేహం ఉందన్న సమాచారం మేరకు ఎస్‌హెచ్‌ఓ ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

యువత భవితతో మంత్రి చెలగాటం

- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్



మెండోరాలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

బాల్కొండ: నియోజకవర్గ యువత భవితతో మంత్రి ప్రశాంత్‌రెడ్డి, మంత్రి తమ్ముడు అజేయ్‌రెడ్డి చెలగాటం ఆడుతున్నారని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ మండిపడ్డారు. యువతను నాశనం చేసేందుకు గంజాయిని సరఫరా చేస్తున్నారని అన్నారు. మెండోరా మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. మంత్రి తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ. 250 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ మాటలను ప్రజలు నమ్మేపరిస్థితిలో లేరి అన్నారు. బీజేపీ గెలుపునకు ప్రజలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు సాయన్న, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

ఖలీల్‌వాడి: జిల్లాలో అక్రమంగా మద్యం రవాణా చేసే వారిపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఏర్పాటు చేయడంతో అక్రమ మద్యం రవాణా కాకుండా అడ్డుకుంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎక్సైజ్ శాఖ ఎన్నికల కోడ్ అమలైన నాటి నుంచి ఇప్పటివరకు 570 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. కేసుల్లో 233 మందిని అరెస్టు చేయగా రూ.2,24,59,664 విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు చెప్పారు. జిల్లాలో ఇప్పటి వరకు 1,42,149 లీటర్ల మద్యంతోపాటు ఇతర మత్తు పదార్థాలు, 43 వాహనాలను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఎక్సైజ్ శాఖ కృషి చేస్తోందని అన్నారు.